
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 128 వ భాగం

## పురంజనోపాఖ్యానం 21

క్రితం వ్యాసంలో చూసాం, చేసిన కర్మ బట్టి ఫలానా జన్మ ఎందుకొస్తోంది అని ప్రాచీనబర్హి నారదుణ్ణి అడిగినట్టు. ఈ విషయం మరింత లోతుగా అర్థం కావడానికి – మనలాంటి వారి కోసమే మరో ప్రశ్న అడుగుతున్నాడు. జాగ్రత్తగా గమనించండి – ఇది చాలా మంచి ప్రశ్న. అడిగిన ప్రశ్న, సమాధానం రెండూ ఒకే వచనం లో ఉన్నాయి కనక రెండింటినీ విడదీసి చూద్దాం.

వ. అదియునుం గాక యాచరితంబైన కర్మంబు తత్క్షణంబ వినష్టం బగుటంజేసి జీవుండు దేహాంతరంబున
లోకాంతరగామి యైన ఫలం బెట్లు సంభవించు;" ననిన ప్రాచీనబర్హికి... [4-885]

ఈ దేహంతో ఆచరించిన కర్మ ఈ దేహం పోయిన వెంటనే నష్టమవ్వాలి కదా? అలా పోయాక కూడా దేహాంతరంలో (మరణం తర్వాత) ఈ కర్మ ఫలం ఎలా చుట్టుకుంటోంది?

దీనికి సమాధానం వినేముందు కొంత వివరణ చూద్దాం. మనకి కనిపించే ఈ శరీరం భౌతికమైనది. దీన్నే స్థూల శరీరం అంటారు. ఈ స్థూల శరీరం "పృథివ్యాపస్తేజో వాయురాకాశాత్," లేదా భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలతో నిర్మించబడినది. ఎముకలు, చర్మం వగైరాలతో తయారైనదే ఈ స్థూల శరీరం. కన్ను చూడగలదు కానీ చూసిన దానిని ఇదీ అని అర్థం చేసుకోవడానికి తలలో ఉన్న నారీమండలంలో నేత్రేంద్రియం కారణం. అలాగే కర్ణేంద్రియం, రసేంద్రియం, స్పర్శేంద్రియం, ఘ్రాణేంద్రియం అనే మిగతా నాలుగూ. ఇవే పంచ తన్మాత్రలు. అవయవాలు ఇంద్రియాలు కావు. అవి ఇంద్రియాలకి జ్ఞానం చేర వేసే ఉపకరణాలు. ఇంద్రియాలు ఈ విషయాలని మనసుకు, అది లోపల ఉన్న బుద్ధికీ చేరవేస్తే మనం ఏమి చేయాలో బుద్ధి నిర్ణయం చేస్తుంది. ఈ జ్ఞానేంద్రియాలు మనకి కనిపించవు. అయినా లేవని చెప్పలేం. అందువల్ల ఇవి ఉండేవి సూక్ష్మ శరీరం అన్నారు. పంచ జ్ఞానేంద్రియ, పంచ కర్మేంద్రియ, పంచ

ప్రాణములు, మనసు, బుద్ధి అనే పదిహేడు వాటితో కూడినదే సూక్ష్మశరీరము, లేదా లింగ శరీరము. వాసనలన్నీ ఉండేది ఇందులోనే. చనిపోయేముందు ఈ జ్ఞానేంద్రియాలన్నీ మనసులో చేరి ప్రాణంతో సహా ఆత్మలో లీనమైనా ఈ వాసనలు లేదా చేసిన కర్మలు లింగ శరీరాన్ని అలాగే అంటిపెట్టుకుని ఉంటాయి.

వాసనలన్నీ తనతో కూడిన లింగ శరీరం మరో స్థూల శరీరానికి కారణం అవుతుంది. అంటే మనం ఈ జన్మలో చేసిన కర్మే వచ్చే జన్మని నిర్దేశిస్తుంది. దీని ఉద్దేశ్యం ఏమిటంటే నిత్యం శుభకర్మలు చేస్తూ ఉంటే మంచి జన్మ రావడానికి ఆస్కారం ఉంది, అందువల్ల ఎప్పుడూ మంచి పనులే చేయాలి అని చెప్పడం. అలా చేసినప్పుడు మనసులో ఏ అల్లకల్లోలం ఉండదు కాబట్టి. అదలా ఉంచుదాం. ఇదే మరో శరీరానికి 'కారణం' అవుతోంది కనక దీన్నే కారణ శరీరం అంటున్నారు. ఈ కారణ శరీరం పని ఏమిటంటే తాను మరో జన్మ ఎక్కడ ఎలా పుట్టవచ్చో స్వంతంగా నిర్ణయించుకుంటుంది అని కొంతమందీ, అలాకాదు వాసనలబట్టి మరో జన్మ నిర్ణయించబడి బలవతంగా మరో శరీరంలో ప్రవేశపెట్టబడుతుందనీ అంటారు. ఏది ఏమైనా గత జన్మలో చేసిన కర్మలని బట్టి మరో జన్మ కలుగుతుందనేది హిందూమతంలో వప్పుకున్నదే. అయితే బుద్ధిః కర్మానుసారిణీ అన్నట్టూ మన ముందు రాబోయే జీవితం మనమే నిర్ణయిస్తున్నాం. As you think, so you become అనే దానిక్కూడా ఇదే అర్ధంగా చెప్పుకోవచ్చు. ఒక స్థూల శరీరంలో జీవుడు ప్రవేశించాక కూడా ఈ సూక్ష్మ శరీరం అన్నివేళాలా ఉండేదే కానీ కనిపించదు. దీన్నే శరీరంలో తేజస్సుగా చెప్పడం కద్దు. ధ్యానం చేసే వారిలోనూ, నిర్మలమైన మనస్సు ఉన్నవారిలోనూ ఈ తేజస్సు ప్రస్ఫుటంగా మొహంలో కనబడడం చూడవచ్చు. పూర్తిగా బ్రహ్మాన్ని తెలుసుకున్నవారిలో ఇది మరింత తేజోమయంగా కనిపిస్తుంది. అందుకే దేవుడి చిత్రాలలో మొహం, దేహం చుట్టూ కాంతివంతంగా చిత్రించడం అనేది ఉంది.

ఇందులో మరో విషయం విషయం ఉంది. కారణ శరీరం మరోసారి స్థూల శరీరంలో జేరడానికి లేదా మార్పు చెందడానికి ఒకే ఒక శరీరం కోరుకోవాలనేది లేది. కారణ శరీరం ఒకటికన్నా ఎక్కువగా విడిపోయి అనేక శరీరాలు ధరించవచ్చు అంటారు. అంటే మన వాసనలు ఎక్కువయ్యే కొద్దీ రాబోయే జీవితాలు కలగాపులగంగా అనేక శరీరాలుగా రూపాంతరం చెందవచ్చు. ఒక తండ్రికో తల్లికో పది మంది పిల్లలు ఉన్నట్టూ కారణ శరీరం విడిపోయి పది స్థూల శరీరాలుగా పునర్జన్మ కలగవచ్చు; జనాభా అతిగా పెరగడానికి ఇదే కారణం అని కొంతమంది అంటారు కూడా. అందువల్ల నిరీశ్వరవాదులనేవారు చెప్పినట్టు, మనిషికి ఉన్నది ఒకే జన్మ, దీనికి ముందూ వెనకా ఏమీ లేవు అని వప్పుకోవడం కష్టం. దీనికి మరో కారణం కూడా ఉంది. ఏపని చేసినా దాని తాలుకు ఫలితం అనుభవించాలి అనేది అందరూ వప్పుకునేదే. కానీ చేసిన కర్మకి ఫలితం రావడానికి కొంత సమయం పట్టవచ్చు. ఆ సమయం ఎంత అనేది

ఎవరూ చెప్పలేం కదా? అందువల్ల ఒక కర్మకి ఫలితం వెనక్కి వచ్చేలోపు మన జీవితం అంతమైతే మరో జన్మ ఎత్తి తీరాలి కర్మ అనుభవించడం కోసం. ఇదే సంసారం అంటే. ఇక్కడ ప్రాచీనబర్హి అదే అడుగుతున్నాడు నారదుణ్ణి. శరీరం పడిపోయాక ఆ "కర్మంబు తత్క్షణంబ వినష్టం బగుటంజేసి జీవుండు దేహాంతరంబున లోకాంతరగామి యైన ఫలం బెట్లు సంభవించు?" దీనికి నారదుడు చెప్పే సమాధానం లో ఈ లింగ శరీరం, కర్మ అనుభవించడం అనేవి చెప్తున్నాడు.

వ. ---.. నారదుం డిట్లనియె "నరేంద్రా! స్వప్నావస్థ యందు లింగశరీరాధిష్ఠాత యైన జీవుండు జాగ్రద్దేహాభిమానంబు విడచి తాదృశంబ కాని యతాదృశంబ కాని యైన శరీరాంతరంబు నొంది మనంబునందు సంస్కార రూపంబున నాహితంబైన కర్మంబు ననుభవించు చందంబునం బురుషుండే లింగ శరీరంబునం జేసి కర్మంబు నాచరించు నా లింగశరీరంబున లోకాంతరంబున దేహవిభేదంబు నొందక తత్ఫలం బనుభవించు; నదియునుం గాక దాన ప్రతిగ్రహాదుల యందు స్థూలదేహంబునకుం గర్తృత్వంబు గల దంటివేని నహంకార మమకార యుక్తుండయిన పురుషుండు మనంబునం జేసి యేయే దేహంబు పరిగ్రహించు, నాయా దేహంబున సిద్ధంబైన కర్మం బా జీవుం డనుభవించు; నట్లు గాకున్నఁ గర్మంబు పునరుద్భవ కారణం బగుట యుపపన్నంబు గాకుండుఁ; గావున మనఃప్రధానం బైన లింగశరీరంబునకే కర్తృత్వం బుపపన్నం బగు" నని వెండియు నిట్లనియె.

[4-885]

సూక్ష్మ లేదా లింగ శరీరాన్ని ఆశ్రయించి ఉండేవాడే అసలైన జీవుడు. అది ఒక శరీరంలోంచి మరో శరీరంలోకి మారుతూ కర్మ అనుభవిస్తూ ఉంటాడు. ఇవ్వడం పుచ్చుకోవడం (దాన ప్రతిగ్రహాదుల) అనేవాటికి స్థూల శరీరం కారణం అనుకోకూడదు ఎందుకంటే అహంకార మమకారాలు ఉన్నది జీవుడికి కానీ స్థూల శరీరానికి కాదు కదా! అందువల్ల ఈ అహంకార మమకారాలు ఏ దేహాన్ని పరిగ్రహిస్తున్నాయో ఆ దేహాన్ని ధరించి కర్మ అనుభవించి తీరాలి. లేకపోతే క్రితం జన్మలో చేసిన కర్మలవల్ల మరో పునర్జన్మ రావడం అనేది కుదరదు; చేసిన కర్మ వినష్టమవడం, మాయమై పోవడం అసలే కుదరదు, ఫలితం అనుభవించాలి కనక. అందువల్ల లింగ శరీరానికే, లేదా సూక్ష్మ శరీరానికే కర్తృత్వం ఆపాదించబడుతోంది.

క. క్షితి నుభయేంద్రియ కర్మ
స్థితు లనుభవ మందఁబడిన చిత్తము పగిదిన్
ధృతిఁ జిత్తవృత్తులను ల
క్షిత మగుఁ దత్పూర్వ దేహకృత కర్మంబుల్. [4-886]

భూమిమీద (క్షితిన్) చేసిన రెండు రకాల కర్మల వల్ల (ఉభయేంద్రియ – జ్ఞాన, కర్మ అనే ఇంద్రియాలు) మనసు (చిత్తము) ఎలా ఉంటుందో ఊహించవచ్చు. అలాగే ఇప్పుడు ధరించిన (ధృతిన్) చిత్త వృత్తులని (జిత్తవృత్తులను లక్షితమగు) బట్టి పూర్వం చేసిన కర్మలని (పూర్వ దేహకృత కర్మంబులన్) ఊహించవచ్చు.

చిన్న పద్యంలో అద్భుతంగా చెప్పిన ఈ విషయం గమనించారా? ఈ జన్మలో ఉన్న మనసు ఇలా ఉండడానికి కరణం, క్రితం జన్మలో చేసిన పనులే/కర్మలే. లేకపోతే ఒకరు మంచిగా ఉండడానికీ, మరొకరు చెడ్డగా ఉండడానికీ, ఒకరికి అహంకారం లేకపోవడానికీ మరొకరికి హిమాలయాలంత అహంకారం ఉండడానికి, ఒకరికి తెలివితేటలు బాగా ఉండడానికీ మరొకరికి లేకపోవడానికీ ఈ వైవిధ్యం లేదా తేడాలు ఏ విధంగా వివరించగలం? అందువల్ల చిత్తం (మనసు) అనేదే అన్నీ అనుభవించేది.

చ. సుమహిత శుద్ధ సత్త్వగుణ శోభితమున్ సరసీరుహోద రో
త్తమ గుణచింతనాపరము ధన్యము నైన మనంబునందు భూ
రమణ! సుధాంశునందు నుపరాగమునన్ దివిఁ దోచు రాహు చం
దమునను గోచరంబగు నుదారత నీ యఖిలప్రపంచమున్. [4-888]

ఇవన్నీ కనిపించని మనసుకే అయితే మరో జన్మ ఉన్నదీ లేనిదీ ఎలా తెలుస్తుంది? దానికి సమాధానం చెప్తున్నాడిప్పుడు – శుద్ధ సత్వగుణం ఉన్న భగవంతుడి (సరసీరుహోదరుడు – సరసీరుహము – పద్మము, ఉదరుడు – కడుపులో ఉన్నవాడు) ధ్యానంలో మునిగినవారికి ప్రపంచంలో సర్వం కనిపిస్తుంది. ఈ విషయం దాదాపు యోగులందరికీ కలిగే అనుభవమే అని తెల్సిన విషయమే. బుద్ధుడు కూడా జ్ఞానం కలిగాక ధ్యానంలో తన పూర్వ జన్మలన్నీ చూసాడనీ, తన ముందు గురువులకోసం, వారికి తాను సాధించినది చెప్పడం కోసం ధ్యానంలో చూస్తే వాళ్ళెవరూ బతికిలేరని

తెలుసుకున్నాడనీ మనకి తెలుస్తుంది. యోగులు కళ్లు మూసుకుని ప్రపంచం అంతా చూడగలరు (యఖిలప్రపంచమున్) ఓ సారి బ్రహ్మజ్ఞానం సంపాదించాక. ఈ విషయం చాలామందికి తెల్సినదే.

త. నరవరోత్తమ! యట్లు గాన మనంబె జీవుల కెల్ల సం
సరణకారణ; మట్టి కర్మవశంబునన్ సకలేంద్రియా
చరణుఁ డౌట నవిద్య గల్గును; సంతతంబు నవిద్యచేఁ
బరఁగుటన్ బహుదేహకర్మనిబంధముల్ గలుగుం జుమీ! [4-891]

అందువల్ల మనస్సే సంసారానికి (జనన మరణాలు) కారణం. ఈ మనసు ఇలా ఉండడానికి కారణం అవిద్య – అంటే తెలియకపోవడం. అవిద్య వల్ల కర్మ బంధనం, దానివల్ల అకేకానేక జన్మలు కలగడం జరుగుతోంది. ఎప్పుడు బాహ్యంగా చూసే మనసు ఆత్మ వైపు లోపలకి చూడ్డం మొదలుపెట్టిందో అప్పుడు మనస్సు అనేది ఆత్మలో లయం అవడం వల్ల [మనసు క్షయం కాగానే] లింగశరీరం నాశనమైన ముక్తి కలుగుతుంది. దీనికి ఉన్న ఒకే ఒక సాధనం భగవంతుణ్ణి సేవిస్తూ ఉండడమే. అలా చెప్పి నారదుడు తన దారిన తాను వెళ్ళాడు.

ఇప్పటికి కళ్ళు తెరుచుకున్న ప్రాచీనబర్హి రాజ్యం మిగతావారికి వదిలి తపస్సు కోసం కపిలాశ్రమానికి వెళ్ళాడు. అక్కడ ఏకాగ్రచిత్తుడు, ముక్తసంగుడు (కోరికలు త్యజించినవాడై), భూరిధైర్య యుక్తుడు (మంచి ధైర్యంతో) అయ్యి భక్తియోగంతో (భగవద్గీతలో చెప్పినట్టూ, ఇది అన్ని యోగాలకంటే సులభం కాబట్టి) గోవిందుణ్ణి ఆరాధిస్తూ ఎవరికీ అంత సులభంగా అందని విష్ణుపథం చేరుకున్నాడు. ఈ కథంతా మైత్రేయుడు విదురుడికి చెప్పాడని, ముగింపు.

4-895-వ. .... నిట్లనియె "ఇట్లు ముకుందయశంబునం జేసి భువనపావనంబు, మనశ్శుద్ధికరంబు, సర్వోత్కృష్టఫలప్రదాయకంబు, దేవర్షివర్య ముఖ వినిస్సృతంబు నైన యీ యధ్యాత్మ పారోక్ష్యంబు నెవ్వండు పఠియించు నెవ్వండు విను నట్టివాఁరు లింగశరీరవిధూననంబు గావించి ముక్త సమస్త బంధుడయి విదేహకైవల్యంబు నొంది సంసారమునందుఁ బరిభ్రమింప" దనిన మైత్రేయునకు విదురుం డిట్లనియె.

ఈ పురంజనోపాఖ్యానం చదివితే అసలు విషయం తెల్సింది కదా? ఈ సంసారానికి సుఖ దుఃఖాలకీ కారణం మన మనస్సే. ఇదంతా వదలాలంటే శరుణాగతి తో భగవంతుడి మీద మనసు పెట్టి ధ్యానం చేయడమొకటే దారి. ఓ సారి

లోపలకి చూడ్డం మొదలు పెట్టిన మనసుకి ఏకాగ్రత వల్ల భగవంతుణ్ణి చేరుకోవడం సులభం లేదా జనన మరణాల నుండి విముక్తి. ఇదే ఏ స్కంధం లో అయినా భాగవతం చెప్పే విషయం అంతా. వచ్చే వ్యాసం నుండి మరో భాగవత కథ చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS